# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం


Follow

పేజీలు 14

శనివారం, డిసెంబర్ 2, 2023

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## ప్రశాంతంగా నిద్రపోయా: కేటీఆర్



**హైదరాబాద్:** 'చాలా రోజుల తర్వాత ప్రశాంతంగా నిద్రపోయా. ఎగ్జిట్ పోల్స్‌లో ఏదో జరుగుతున్నట్లు చూపొచ్చు. కానీ ఎగ్జాక్ట్ పోల్స్ మాకు శుభవార్తను అందజేస్తాయి'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వ్యాఖ్యానించారు. శుక్రవారం ప్రగతిభవన్‌లోనే ఉన్న కేటీఆర్.. సీఎం కేసీఆర్‌తో జరిగిన భేటీలో పాల్గొన్నారు. అనంతరం అక్కడే ఉన్న మంత్రి హరీశ్‌రావు కూడా మాట్లాడుతూ..శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం వంద రోజుల పాటు శ్రమించిన కార్యకర్తల సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు.

# కాంగ్రెస్‌ను గెలిపించిన బండి సంజయ్

**సంజయుడే అధ్యక్షుడిగా బీఆర్ఎస్ విజయం సాధించేది?**

**తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వెనుకబడిన బీజేపీ ?**

**సంజయ్ ను తప్పించి కాంగ్రెస్ కు మేలు చేసిన కమలం**

**గౌరవప్రద స్థానాలు సాధిస్తామంటూ కిషన్ రెడ్డి వ్యాఖ్యలు**

**మొన్నటిదాకా అధికారం ఖాయమంటూ ప్రకటనలు..**

**మొత్తమ్మీద ఈ ఎన్నికల్లో కమలం గెలిచేది 5-6 సీట్లే?**

**బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉండి ఉంటే ఈ కథే వేరు**

**ఆయనను తప్పించాక రేసులో బీజేపీ వెనుకబాటు**

**బీసీ సీఎం హామీ ఇచ్చినప్పటికీ బీజేపీని నమ్మని ప్రజలు**


*తెలంగాణ ఎన్నికలు ముగిశాయి. మరొక్క 36 గంటల్లో ఫలితాలూ వెలువడనున్నాయి. ఇప్పటివరకు ఉన్న ఎగ్జిట్ పోల్స్ 24. వాటిలో 20 ఎగ్జిట్, ప్రీ పోల్స్ తెలంగాణలో కాంగ్రెస్ కే అధికారం అంటూ చెబుతున్నాయి. ఇక బీఆర్ఎస్ మాత్రమే నాలుగంటే నాలుగే ఎగ్జిట్స్ పోల్స్ మొగ్గుచూపాయి. ఇక్కడ గమనించాల్సింది ఏమంటే .. 24 సర్వేలూ బీజేపీ గెలుస్తుందని మాత్రం చెప్పలేదు. కాకపోతే కమలం పార్టీ కొన్ని స్థానాలు మెరుగుపర్చుకుంటుందని చెబుతున్నాయి.*

### సంజయ్‌కు కాంగ్రెస్ థ్యాంక్స్ చెప్పాలేమో..?

తెలంగాణలో మూడున్నరేళ్ల కిందటి వరకు బీజేపీ ఓ పార్టీ మాత్రమే. అలాంటి పార్టీని ముందువరసలోకి తీసుకొచ్చారు బండి సంజయ్. 2020 మార్చిలో ఆయన అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆ తర్వాత ఏడాదిన్నర కాలం కొవిడ్ తోనే పోయింది. అయినా, మిగిలిన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ వచ్చారు సంజయ్. తన పోరాట పటిమతో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉద్యమించారు. ఎక్కడికంటే అక్కడకు వెళ్తూ.. ప్రజా సమస్యలపై ఆందోళనలకు దిగుతూ.. బీజేపీని పైకి లేపారు. ఆ సమయంలో రాష్ట్రంలో కాంగ్రేస్ పార్టీకి సరైన నాయకత్వమే లేదంటే నమ్మాల్సిందే. కానీ, నాలుగు నెలల కిందట సంజయ్ ను అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించింది బీజేపీ అధిష్ఠానం. ఆయన స్థానంలో ఇప్పటికే రెండు సార్లు అధ్యక్షుడిగా పనిచేసిన,కేంద్ర మంత్రిగానూ ఉన్న జి.కిషన్ రెడ్డిని నియమించింది. కాగా, కిషన్ రెడ్డి సౌమ్యుడు. బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడినవారే అయినా.. సంజయ్ తరహాలో దూకుడుగా ముందుకెళ్లలేని వ్యక్తి ఆయన. సరిగ్గా ఎన్నికలకు ముందు ఆయనను నియమించడం, సంజయ్ ను తప్పించడం వెనుక బీజేపీ-బీఆర్ఎస్ మధ్య లాలూచీగా చాలా మంది ఆరోపించారు. దీనిని పక్కనపెడితే.. ఎప్పుడైతే సంజయ్ రంగంలోంచి తప్పుకొన్నారో అప్పుడే బీజేపీ వెనుకబడిపోయి కాంగ్రెస్ పుంజుకుంది. అదే సమయంలో కర్ణాటక ఫలితాలు వెలువడి కాంగ్రెస్ పార్టీ అక్కడ బీజేపీని ఓడించి అధికారంలోకి రావడంతో హస్తానికి తెలంగాణలో ఊపు వచ్చినట్లయింది. ఈ పరిణామం తాజా ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేస్తున్నదని సర్వేలు చెబుతున్నాయి. అందుకే కాంగ్రెస్ పార్టీ సంజయ్ కు థ్యాంక్స్ చెప్పాలనేది.

### మొన్నటిదాక అధికారం.. నేడు గౌరవప్రదం

బీజేపీ జాతీయ పెద్దల నుంచి రాష్ట్ర నాయత్వం వరకు మొన్నటిదాక తాము తెలంగాణలో అధికారంలోకి వచ్చేస్తున్నట్లు చెప్పారు. కానీ,గురువారం పోలింగ్ ముగిశాక మాత్రం కిషన్ రెడ్డి మాటలో మార్పు వచ్చింది. రాష్ట్రంలో తాము గౌరవప్రద సంఖ్యలో సీట్లు నెగ్గుతామని పోలింగ్ అనంతరం ప్రకటించారు. దీనినిబట్టే బీజేపీ తెలంగాణ ఎన్నికల్లో మూడో లేదా నాలుగో స్థానానికి పరిమితం కానున్నదని స్పష్టమవుతోంది.



### సంజయ్‌నే తప్పించాక.. బీ"సీఎం"ను ఎవరూ నమ్మలేదు

తెలంగాణలో బీజేపీని దాదాపు రెండోస్థానానికి తీసుకొచ్చిన సంజయ్ ను తప్పించిన బీజేపీ.. ఎన్నికల సమయంలో తాము గెలిస్తే బీసీ నాయకుడిని సీఎం - మిగతా 2వ పేజీలో

# ఆగమెందుకు.. మళ్లీ మనమే!



## ప్రగతిభవన్‌లో తనను కలిసిన నేతలతో సీఎం కేసీఆర్

**శుక్రవారమంతా ప్రగతిభవన్‌లో కేటీఆర్, హరీశ్‌రావులతో సమీక్ష...**

**సెగ్మెంట్ల వారీగా అందిన నివేదికలపై పోస్టుమార్టం**

**ఓట్ల లెక్కింపుపై సూచనలు.. పార్టీ అభ్యర్థులతో టచ్‌లో**

**ఉండాలని ఆదేశం... కౌంటింగ్ ఏజెంట్ల నియామకం,**

**ఇతర అంశాలపై దిశానిర్దేశం**

**ఈ నెల 4న మధ్యాహ్నం సచివాలయంలో**

**మంత్రివర్గ సమావేశానికి నిర్ణయం**

**హైదరాబాద్:** "ఆగమాగం, పరేశాన్ ఎందుకు అయితున్నరు. మళ్లా మనమే గెలుస్తున్నం. ఈ రాష్ట్రానికి సుపరిపాలన అందించబోతున్నాం. రెండు రోజులు నిమ్మళంగా ఉండండి. 3వ తేదీన అందరం కలసి సంబురాలు చేసుకుందాం.." అని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పార్టీ శ్రేణులకు సూచించారు. శుక్రవారం పొద్దంతా ఓటింగ్ సరళి, ఇతర అంశాలపై సమీక్షించిన సందర్భంగా నేతలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. మరోవైపు ఈ నెల 4న (సోమవారం) మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగుతుందని సీఎంవో నుంచి ప్రకటన వెలువడింది. ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుండటంతో.. సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు, కేబినెట్ భేటీ నిర్వహణకు నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

### 4న సీఎం అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం

*హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ఈనెల 4న మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో ౦ రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుందని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఈనెల 3న వెల్లడి కానుండగా, మరుసటి రోజు మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని సీఎం నిర్ణయం తీసుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు అనుకూలంగా రానున్నాయనే ధీమాను పార్టీ వర్గాల్లో కల్పించడానికే కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చర్చ జరుగుతోంది.*

**ప్రగతిభవన్‌కు బారులు తీరిన నేతలు:** సీఎం కేసీఆర్ గురువారం సాయంత్రమే ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి ప్రగతిభవన్‌కు చేరుకోగా.. శుక్రవారం ఉదయం నుంచే బీఆర్ఎస్ నేతలు ప్రగతిభవన్‌కు బారులు తీరారు. పార్టీ పార్లమెంటరీ నేత కె.కేశవరావు, మంత్రి నిరంజన్‌రెడ్డి, మధుసూదనాచారి, బాల్క సుమన్‌తోపాటు నల్గొండ, హైదరాబాద్ తదితర జిల్లాలకు చెందిన నేతలు వచ్చి సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆదివారం వెలువడే ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కే సానుకూలంగా ఉంటాయని - మిగతా 2వ పేజీలో

# రిగ్గింగ్ ఆరోపణలు అవాస్తవం

**కొన్ని కేంద్రాల్లో రాత్రి 9.30 వరకు ఓటింగ్ కొనసాగింది**

**అందుకే సాయంత్రం 5 గంటలతో పోల్చితే పోలింగ్ శాతం పెరిగింది: వికాస్‌రాజ్**



ఆర్వోలు, పరిశీలకులు స్క్రూటినీ నిర్వహిస్తున్నారు

రిగ్గింగ్ ఆరోపణల అంశంపైనా పరిశీలన జరుపుతారు

ఆ తర్వాతే తుది పోలింగ్ శాతం, ఆరోపణలపై స్పష్టత

అసెంబ్లీ ఎన్నికలకు 'సాగర్' ఘటనతో సంబంధం లేదు

3న ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడి

# ఓటర్ల సంఖ్య పెరిగినా పోలింగ్ తగ్గింది

2లో

ఈసారి 26.78 లక్షల మంది అధికంగా ఓటు

కానీ పెరిగిన ఓట్ల సంఖ్య మేరకు జరగని పోలింగ్

2018లో 73.2% పోలింగ్.. ఈసారి 71.34 శాతమే

## కాంగ్రెస్‌కే పూర్తి మెజారిటీ!

ఇండియా టుడే- యాక్సిస్ మైఇండియా ఎగ్జిట్‌పోల్స్ అంచనా

కాంగ్రెస్‌కు 42 శాతం ఓట్లతో 63-73 స్థానాలు

బీఆర్ఎస్‌కు 32 శాతం ఓట్లతో 34-44 స్థానాలు

బీజేపీకి 4-8 సీట్లు.. ఎంఐఎం సహా ఇతరులకు 5-8 సీట్లు

**ప్రభుత్వ వ్యతిరేకత, సిట్టింగ్‌లపై ప్రజాగ్రహం ప్రభావం చూపినట్టు వెల్లడి**

**హైదరాబాద్/న్యూఢిల్లీ:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లను సాధిస్తుందని ఇండియా టుడే- యాక్సిస్ మైఇండియా ఎగ్జిట్‌పోల్ సర్వే పేర్కొంది. మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను.. అధికార బీఆర్ఎస్‌కు 36 శాతం ఓట్లతో 34-44 సీట్లు వస్తాయని, కాంగ్రెస్ పార్టీ 42 శాతం ఓట్లతో 63-73 సీట్లు సాధించి అధికారంలోకి వస్తుందని అంచనా వేసింది. బీజేపీకి 14శాతం ఓట్లతో 4 నుంచి 8 సీట్లు రావొచ్చని.. ఎంఐఎం 8శాతం ఓట్లతో 5-7 సీట్లు సాధించవచ్చని తెలిపింది. రాష్ట్రంలో గురువారం పోలింగ్ ముగియగానే.. - మిగతా 2వ పేజీలో

## మ్యాజిక్ ఫిగర్.. ఎంతెంత దూరం?

అధికారంలోకి వస్తున్నామా, లేదా అంటూ కాంగ్రెస్ శ్రేణుల్లో విస్తృత చర్చ

జిల్లాలు, నియోజకవర్గాల వారీగా నేతల అంచనాల మీద అంచనాలు

గ్రామాలు, మండలాల వారీగా పోలింగ్ లెక్కలతో పార్టీ అభ్యర్థులు బిజీ

ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ.. 'కౌంటింగ్'కోసం ఏజెంట్ల ఎంపిక

హైదరాబాద్ చేరుకున్న రేవంత్, భట్టి.. సన్నిహిత నేతలతో భేటీలు

పోలింగ్ సరళిపై చర్చలు.. సునీల్ నివేదికలో సానుకూల ఫలితాలు

**హంగ్ వస్తే గెలిచిన వారంతా కర్ణాటకకే.. నేడు డీకే శివకుమార్?**

**హైదరాబాద్:** అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసి, ఎగ్జిట్ పోల్స్ కూడా విడుదలైన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణుల్లో గెలుపోటములపై తీవ్ర చర్చ సాగుతోంది. ఈసారైనా అధికారంలోకి వస్తున్నామా, లేదా అన్నదానిపై అభ్యర్థులు, ముఖ్య నేతలు, పార్టీ కేడర్‌లో ఉత్కంఠ కనిపిస్తోంది. పోలింగ్ సరళి అనుకూలమనే లెక్కలు, 'చేతి'కి మొగ్గ ఉందన్న ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు నిజమవుతాయా, మ్యాజిక్ ఫిగర్ దాటి పవర్‌లోకి వస్తామా అన్న దానిపైనే శుక్రవారం పొద్దంతా కాంగ్రెస్ శ్రేణులు చర్చలతో గడిపాయి. కౌంటింగ్‌కు మరోరోజు ఉన్న నేపథ్యంలో.. ఎన్ని స్థానాల్లో గెలుస్తాం? - 2వ పేజీలో

## 18 నుంచి 22 సీట్లు గెలుస్తాం

ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్,

కరీంనగర్ జిల్లాల్లో 10 నుంచి 12 సీట్లు

గ్రేటర్ హైదరాబాద్‌లో 4, రంగారెడ్డి, వరంగల్, మెదక్

జిల్లాల్లో ఒకట్రెండు సీట్ల గెలుపుపై ముఖ్యనేతల ధీమా

**పోలింగ్ పెరగడంపై సంతృప్తి.. బీజేపీ నేతల ఆశాభావం**

**హైదరాబాద్:** అసెంబ్లీ ఎన్నికల్లో 18 నుంచి 22 సీట్ల వరకు గెలుస్తామని బీజేపీ నేతలు ఆశాభావంతో ఉన్నారు. పార్టీ బలంగా ఉన్న ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో 10 నుంచి 12, అలాగే గ్రేటర్ పరిధిలో 4, రంగారెడ్డి, వరంగల్, మెదక్ జిల్లాల్లో ఒక్కొక్క సీటు గెలుపుపై బీజేపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తుండడం గమనార్హం. కొన్ని నియోజకవర్గాల్లోని వివిధ పోలింగ్ బూత్‌లలో గురువారం రాత్రి దాకా పోలింగ్ కొనసాగడంతో ఆయా ప్రాంతాల నుంచి పార్టీ కార్యాలయానికి సమాచారం ఆలస్యంగా - మిగతా 2వ పేజీలో


# కాంగ్రెస్‌ను గెలిపించిన బండి సంజయ్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామంటూ ప్రకటించింది. కానీ, అంతటి సంజయ్ నే తప్పించిన బీజేపీ.. బీసీ సీఎం హామీని ఇచ్చినా ఎవరూ నమ్మలేదు. మరోవైపు ఎస్సీ వర్గీకరణ అంటూ ప్రధాని మోదీ చేసిన హంగామానూ పట్టించుకోలేదని స్పష్టమవుతోంది. ఇక ఎస్సీ వర్గీకరణ అంటే తెలుగు రాష్ట్రాల్లో తేనె తుట్టెను కదిలించడమే. ఇప్పటికైతే.. కమిటీ అంటూ హడావుడి చేస్తున్నారు. కానీ, ఎన్నికల ఫలితం వచ్చాక ఏం చేస్తారనేది చెప్పలేం.

**సంజయ్ ఉంటే ఆ కథే వేరు...:** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్ ఉండి.. ఎన్నికలలో పోటీ పడినట్లయితే రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి భిన్నంగా ఉండేది అని చెప్పడంలో సందేహం లేదు. తన ఉద్యమాలు, పోరాటంతో పేరు తెచ్చుకున్న సంజయ్.. మీడియా సమావేశాల్లో సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వానికి సంబంధించి కీలక పాయింట్లను లేవనెత్తేవారు. అలాంటగి ఆయనను జాతీయ ప్రధాన కార్యదర్శిని చేసి మొండికత్తితో తెలంగాణ ఎన్నికల్లో పోరాడింది బీజేపీ. అప్పటికీ సంజయ్ ను ఎన్నికల సమయంలో ముందుపెట్టింది. ఆయన తరచూ మీడియా సమావేశాలు నిర్వహించేలా చూసింది. కానీ, అధ్యక్ష బాధ్యతల్లో లేనందున అది ప్రాధాన్యం కాలేదు. మరోవైపు సంజయ్ కు కనీసం కేంద్ర ప్రభుత్వంలో సహాయ మంత్రి పదవి కూడా ఇవ్వలేదు. ఆయనను జాతీయ ప్రధాన కార్యదర్శి పదవితో సరిపెట్టడం తెలంగాణలో బలమైన మున్నూరు కాపు, బీసీ సామాజికవర్గాలను బీజేపీకి దూరం చేసింది.

# కాంగ్రెస్‌కే పూర్తి మెజారిటీ!




(మొదటి పేజీ తరువాయి)

జాతీయ, ప్రాంతీయ మీడియా సంస్థలు, సర్వే సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్ సర్వేలను విడుదల చేశాయి. చాలా వరకు కాంగ్రెస్ వైపు మొగ్గ ఉన్నట్టు పేర్కొన్నాయి. ఈ క్రమంలో ఇండియా టుడే- యాక్సిస్ మైఇండియా శుక్రవారం తెలంగాణ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను ప్రకటించింది. బీఆర్ఎస్ సర్కారుపై వివిధ వర్గాల ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకత ఎగ్జిట్‌పోల్ సర్వేలో కనిపించిందని పేర్కొంది. ముఖ్యంగా సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో చాలా మందికి మళ్లీ టికెట్ ఇవ్వడం, వారిపై స్థానికంగా నెలకొన్న తీవ్ర వ్యతిరేకత ప్రభావం చూపిందని విశ్లేషించింది.

**ప్రాంతాల వారీగా పరిశీలన జరిపి:** రాష్ట్రంలో ఉత్తర, మధ్య (సెంట్రల్), దక్షిణ తెలంగాణ, హైదరాబాద్ ప్రాంతాల వారీగా ఇండియాటుడే-యాక్సిస్ ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేసింది. ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు సాగిందని.. హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌దే పైచేయిగా ఉందని వివరించింది. దక్షిణ, మధ్య తెలంగాణలలో కాంగ్రెస్ పూర్తి ఆధిపత్యాన్ని కనబరిచిందని, ఈ ప్రాంతాల నుంచే ఎక్కువ సీట్లు గెలిచే అవకాశం ఉందని పేర్కొంది.

- ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్‌కు 13, కాంగ్రెస్‌కు 15, బీజేపీకి 5 సీట్లు రావొచ్చని పేర్కొంది.
- దక్షిణ తెలంగాణలో బీఆర్ఎస్‌కు 6, కాంగ్రెస్‌కు 27, బీజేపీకి ఒక స్థానం వస్తాయని అంచనా వేసింది.
- మధ్య తెలంగాణలో బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 22 సీట్లు సాధించవచ్చని తెలిపింది.
- హైదరాబాద్‌లో బీఆర్ఎస్ 11, కాంగ్రెస్ 3, బీజేపీ 1, ఎంఐఎం 6 చోట్ల గెలిచే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసింది.
- తెలంగాణ తదుపరి సీఎంగా కేసీఆర్ ఉంటే బాగుంటుందని 32శాతం మంది, రేవంత్‌రెడ్డి కావాలని 21 శాతం మంది, ఇతర కాంగ్రెస్ నాయకుడు సీఎం కావాలని 22 శాతం మంది, బీజేపీ నాయకుడు ఉంటే బాగుంటుందని 12 శాతం మంది తమ సర్వేలో పేర్కొన్నట్టు వెల్లడించింది.

# రేవంత్‌రెడ్డిని సీఎం చెయ్యొద్దు

## ఏఐసీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత బక్క జడ్సన్



**పంజగుట్ట (హైదరాబాద్):** టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయవద్దని, ఆయన బీఆర్ఎస్ పార్టీ కోవర్టు అని ఏఐసీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత బక్క జడ్సన్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి, కల్వకుంట్ల కవిత స్నేహితురాలు ఎన్ఆర్ఐ మందుల వినుత ఇద్దరూ వ్యాపారంలో భాగస్వామ్యులని ఏఐసీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత బక్క జడ్సన్ వెల్లడించారు. తెలంగాణను ఒక దొంగ చేతినుంచి మరో దొంగకు తాళాలు అప్పగించవద్దని కాంగ్రెస్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓడిపోవాలని రేవంత్‌రెడ్డి ఎన్నో ప్రయత్నాలు చేశారని, 53 మంది ఓడిపోయే అభ్యర్థులకు టికెట్లు ఇచ్చారని విమర్శించారు. తన వ్యాఖ్యలవల్ల పార్టీకి నష్టం కలగకూడదనే ఇన్నిరోజులు ఆధారాలు బయటపెట్టలేదని అందుకే ఎన్నికలయ్యాక సమావేశం పెట్టినట్లు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన పేర్కొన్నారు. 2012లో అప్పటి తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి, కేసీఆర్ కూతురు కవిత మిత్రురాలైన ఎన్ఆర్ఐ మందుల వినుత డైరెక్టర్లుగా ఆడికోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కంపెనీని నెలకొల్పారని 2009 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమం సమయంలోనే కేసీఆర్ ఆస్తులు విపరీతంగా పెరిగాయని చెప్పారు. స్వయంగా ఓటుకు కోట్లు కేసులో తనంతటతానే పట్టుబడేలా కవిత, కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డి కుట్రపన్నినట్లు ఆరోపించారు. అనంతరం చంద్రబాబును బెదిరించి భారీగా డబ్బులు గుంజి ఆ సొమ్ముతోనే రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేశారని తెలిపారు.

# మ్యాజిక్ ఫిగర్.. ఎంతెంత దూరం?

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడెక్కడ గట్టి పోటీ అవకాశముంది? ఎక్కడెక్కడ ఓడిపోవచ్చు? దక్షిణ తెలంగాణను నిజంగానే స్వీప్ చేస్తున్నామా? ఉత్తర తెలంగాణలో బలం పెరిగిందా? హైదరాబాద్, శివారు నియోజకవర్గాల పరిస్థితేంటి? అన్న అంశాలపై నేతలు లెక్కలు వేసుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడి నుంచి గ్రామస్థాయి కార్యకర్త వరకు ఇదే తీరు కావడం గమనార్హం.

**ఉత్కంఠలో అభ్యర్థులు:** ఎన్నికల్లో పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థులు తీవ్ర ఉత్కంఠలో ఉన్నారు. తాము గెలుస్తామా లేదా అన్నదానిపై లెక్కలు వేసుకుంటున్నారు. గ్రామ, మండల స్థాయి నేతలతో భేటీ అవుతూ.. ఏ గ్రా మంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయి? అందులో తమ కు పడిన ఓట్లెన్ని? ఏ మండలంలో ఎంత మెజార్టీ వస్తుంది? ఎంత తక్కువ వస్తాయనే అంశాలతో క్షేత్రస్థాయిలో పోలింగ్ సరళిపై అంచనాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇదే సమయంలో ఆదివారం జరగనున్న కౌంటింగ్ కోసం ఏజెంట్లు, వారికి కావాల్సిన పత్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. పోలింగ్ రోజున ఎంత జాగ్రత్తగా ఉన్నామో, కౌంటింగ్ కేంద్రాల్లోనూ అంతే జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడా తేడా రాకుండా కౌంటింగ్‌ను పరిశీలించాలని ఏజెంట్లకు సూచనలిస్తున్నారు.

**ఎప్పటికప్పుడు ఏఐసీసీతో సంప్రదింపులు:** తెలంగాణ ఫలితం



సానుకూలంగా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో.. టీపీసీసీ నాయకత్వం ఎప్పటికప్పుడు ఏఐసీసీ నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తదితరులు తమ నియోజకవర్గాల నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఢిల్లీ పెద్దలతో టచ్‌లో ఉన్నారు. రాష్ట్రంలోని పరిస్థితిని వారికి వివరిస్తూ, ఏయే పరిణామాలు తలెత్తితే ఎలా ఎలా వ్యవహరించాలన్న దానిపై హైకమాండ్ నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. మరోవైపు వ్యూహకర్త సునీల్ కనుగోలు కూడా పోలింగ్ సరళిపై ఇచ్చిన నివేదికలో పార్టీకి అధికారం వస్తుందని పేర్కొన్నట్టు తెలిసింది. దీనికి అనుగుణంగా టీపీసీసీ నాయకత్వం ఏర్పాట్లు చేసుకుంటోంది. హైదరాబాద్‌లోని రేవంత్, భట్టి నివాసాలకు పలువురు పార్టీ నేతలు వెళ్లి చర్చలు జరిపారు. పోలింగ్ సరళి ఎలా జరిగింది? ఏ జిల్లాలో ఎలాంటి ఫలితాలు వస్తున్నాయన్న దానిపై చర్చించారు.

**పూర్తి మెజార్టీ రాకుంటే ఏం చేద్దాం?:** ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నా.. ఆదివారం వెలువడే ఫలితాల్లో పార్టీకి వచ్చే సీట్లను బట్టి పావులు ఏఐసీసీ, టీపీసీసీ ప్రణాళికలు రచిస్తున్నాయి. అధికారం చేపట్టేందుకు అవసరమైన దానికంటే ఎక్కువ స్థానాల్లో గెలిస్తే ఎలాంటి సమస్యా ఉండదని నేతలు పేర్కొంటున్నారు. కానీ ఎక్కువ సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలిచినా పూర్తి మెజార్టీ రాకుంటే.. గెలిచిన నాయకులందరినీ తక్షణమే కర్ణాటకకు తరలించి క్యాంపు పెట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్టు సమాచారం. దీనికి సంబంధించి కాంగ్రెస్ ముందు జాగ్రత్త చర్యలు కూడా చేపట్టిందని.. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను హైదరాబాద్‌కు పంపాలని నిర్ణయించిందని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి. డీకే శివకుమార్ శనివారం మధ్యాహ్నం కల్లా హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉందని అంటున్నాయి. ఇక కొన్నిసీట్లు తక్కువపడితే ఎంఐఎం మద్దతు తీసుకోవాలా, వద్దా? అన్న అంశంపైనా ఏఐసీసీతో టీపీసీసీ నేతల సంప్రదింపుల సందర్భంగా చర్చకు వచ్చినట్టు తెలిసింది.

# ఆగమెందుకు.. మళ్లీ మనమే!

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ ధీమా వ్యక్తం చేసినట్టు తెలిసింది. కేసీఆర్‌తో భేటీ తర్వాత ప్రగతిభవన్ నుంచి బయటకు వచ్చిన నేతలంతా.. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని పేర్కొనడం గమనార్హం. మరోవైపు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత నివాసంలో భేటీ అయ్యారు.

**కేటీఆర్, హరీశ్‌రావులతో సమీక్ష:** పార్టీ అధినేత కేసీఆర్‌తో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మంత్రి హరీశ్‌రావు ఇద్దరూ ప్రగతిభవన్‌లో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. జిల్లాలు, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా వార్‌రూమ్‌ల నుంచి, వివిధ వర్గాల నుంచి అందిన గణాంకాలు, నివేదికలతోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జులు, అభ్యర్థుల నుంచి అందిన వివరాలను విశ్లేషించారు. కీలక నియోజకవర్గాలు గజ్వేల్, కామారెడ్డి, కొడంగల్‌లో ఓటింగ్ సరళిపైనా పోస్టుమార్టం చేశారు. పార్టీ సాంప్రదాయ ఓటు బ్యాంకుతోపాటు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు బీఆర్ఎస్‌కు అనుకూలంగానే ఓటింగ్‌లో పాల్గొన్నారని ఈ సందర్భంగా కేసీఆర్ అభిప్రాయం వ్యక్తం చేసినట్టు తెలిసింది. హంగ్ ఫలితాలకు అవకాశం లేదని, స్పష్టమైన మెజారిటీతోనే బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ ధీమా వ్యక్తం చేసినట్టు సమాచారం.

**ఎగ్జిట్ పోల్స్ కాదు.. ఎగ్జాక్ట్ పోల్స్ లెక్క!**

అసెంబ్లీ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని సీఎం కేసీఆర్ తనను కలసిన నేతలతో పేర్కొన్నట్టు తెలిసింది. బీఆర్ఎస్ పకడ్బందీగా చేసిన పోల్ మేనేజ్‌మెంట్‌తోపాటు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలో బీజేపీ చీల్చిన ఓట్లను పరిగణనలోకి తీసుకుంటే బీఆర్ఎస్‌కే సానుకూలత ఉందని చెప్పినట్టు సమాచారం. ఎగ్జిట్ పోల్స్ కాకుండా ఎగ్జాక్ట్ పోల్‌నే లెక్క అని పేర్కొన్నట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఆదివారం జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారని.. ఏజెంట్ల నియామకం మొదలు ప్రక్రియ పూర్తయ్యేదాకా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారని సమాచారం. ఎన్నికల ఫలితాలు వెలువడే క్రమంలో పార్టీ అభ్యర్థులతో టచ్‌లో ఉండాలని కేటీఆర్, హరీశ్‌రావులకు సూచించారని తెలిసింది.

# 18 నుంచి 22 సీట్లు గెలుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చేరింది. క్షేత్రస్థాయి సమాచారం, పార్టీ నాయకుల నుంచి సేకరించిన వివరాల ప్రకారం ముఖ్యనేతలు పార్టీ గెలిచే స్థానాలపై ఈ అంచనాకు వచ్చినట్లు చెపుతు న్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లతో బీజేపీ ముఖాముఖిగా పోటీపడుతున్న సీట్లతో పాటు, ఈ మూడుపార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొన్న నియోజకవర్గాల్లో కొన్ని చోట్ల అనూహ్య ఫలితాలు వస్తాయని గట్టిగా నమ్ముతున్నారు. కనీసం 25 నుంచి 30 సీట్లలో గట్టి పోటీనివ్వడంతో పాటు, పార్టీ బలంగా ఉన్న చోట్ల ఓటింగ్ శాతం పెరగడం ద్వారా 15 నుంచి 20 శాతం దాకా బీజేపీ ఓటింగ్ శాతం నమోదు చేస్తుందని విశ్వసిస్తున్నారు. కాగా, పార్టీ అభ్యర్థులు పోటీ చేసిన 111 నియోజక వర్గాల్లో పోలింగ్ శాతం పెరగడం, ఇతర సానుకూల అంశాలపై నేతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే గురు, శుక్రవారాల్లో వివిధ సర్వే సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్‌పోల్స్ ఫలితాల్లో బీజేపీకి అంతగా సానుకూలత కనిపించకపోవడం పట్ల పార్టీ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అధికారికంగా వెలువడ్డాక వాస్తవ పరిస్థితిని బేరీజు వేయాల్సి ఉంటుందని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు.

# రిగ్గింగ్ ఆరోపణలు అవాస్తవం

**కొన్ని కేంద్రాల్లో రాత్రి 9.30 వరకు ఓటింగ్ కొనసాగింది..**

**అందుకే సాయంత్రం 5 గంటలతో పోల్చితే పోలింగ్ శాతం పెరిగింది: వికాస్‌రాజ్**

**హైదరాబాద్:** రాష్ట్ర శాసనసభకు గురువారం జరిగిన ఎన్నికల్లో పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరగడంతోనే సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ శాతం భారీగా పెరిగిందన్న ఆరోపణలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ తోసిపుచ్చారు. రాష్ట్రంలో దాదాపు అన్ని పరిధిలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9.30 గంటల వరకు ఓటింగ్ కొనసాగడంతోనే పోలింగ్ శాతం పెరిగిందని చెప్పారు. శుక్రవారం వికాస్‌రాజ్ తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 13 వామపక్ష తీవ్రవాద ప్రభావిత నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటలకు, మిగతా చోట్ల సాయంత్రం 5 గంటలకే పోలింగ్ సమయం ముగిసినా.. అప్పటికే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని క్యూలైన్లలో నిలబడిన వారందరికీ నిబంధనల ప్రకారం ఓటేసే అవకా శం కల్పించామని వికాస్‌రాజ్ వివరించారు. అందువల్ల ఆయాచోట్ల రాత్రి 9.30 గంటల వరకు పోలింగ్ జరిగిందని, అధికారులు ఈవీఎంలు, ఇత ర సామగ్రిని సర్దుకుని రిసెప్షన్ కేంద్రాలకు చేరు కునే సరికి మరింత ఆలస్యమైందని చెప్పారు. రిసె ప్షన్ కేంద్రాల్లో ఈవీఎంలకు ప్రాథమిక తనిఖీలు నిర్వహించి, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చినట్టు వెల్లడించారు. ప్రాథమిక స్క్రూటినీ తర్వాతే 70.6 శాతం పోలింగ్ జరిగినట్టు ప్రాథమి కంగా అంచనాకు వచ్చామని తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు కూర్చుని అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో తుది స్క్రూటినీ నిర్వహిస్తున్నా రని వివరించారు. చాంద్రాయణగుట్ట సహా ఇతర స్థానాల్లో రిగ్గింగ్ జరిగినట్టు వచ్చిన ఫిర్యా దుల మేరకు సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు పరిశీలిస్తు న్నట్టు తెలిపారు. స్క్రూటినీ ముగిశాకే కచ్చితమైన పోలింగ్ శాతంతోపాటు రిగ్గింగ్ ఆరోపణల్లో నిజానిజాల పై స్పష్టత వస్తుందని.. ఆయా అంశాల ఆధారంగా తుది నిర్ణయాలు తీసుకుంటామని వివరించారు.

**ప్రశాంతంగా పోలింగ్**

చెదురుమదురు ఘటనలు మినహా రాష్ట్రంలోని అన్ని శాసనసభ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని వికాస్‌రాజ్ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలన్నీ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్నట్టుగా ధ్రువీకరించుకున్నామ ని వివరించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 40 కంపెనీల కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని చెప్పారు. 158పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఆయాచోట్ల కొత్త ఈవీఎంలను పెట్టి పోలింగ్ నిర్వహించామని.. దీనివల్ల కొన్ని పోలింగ్ కేంద్రాల్లో 45 నిమిషాల వరకు ఆలస్యమైందని అదనపు సీఈఓ లోకేశ్‌కుమార్ వివరించారు.

**నాగార్జున సాగర్ అంశానికి ఎన్నికలతో సంబంధం లేదు**

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి సగభాగాన్ని ఏపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఘటనకు రాష్ట్ర శాసనసభ ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదని వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. డీప్ ఫేక్, ఇతర తప్పుడు ప్రచారాల ఆరోపణలపై సోషల్ మీడియాలోని 120 లింక్‌లను తొలగించామన్నారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గడంపై విశ్లేషణ జరుపుతామన్నారు. డబ్బులు పంచుతూ కొందరు అభ్యర్థులు, వారి బంధువులు పట్టుబడిన ఘటనలపై స్పందిస్తూ.. రాష్ట్ర మంత్రులపై కేసులు నమోదయ్యాయని, రికార్డు స్థాయిలో 13వేలకుపైగా కేసులు పెట్టామని వికాస్‌రాజ్ వివరించారు.

**భారీగా పెరిగిన పోస్టల్ బ్యాలెట్లు**

ఈసారి పోస్టల్ బ్యాలెట్ల ఓటింగ్ గణనీయంగా పెరిగిందని వికాస్‌రాజ్ తెలిపారు. 16,005 మంది 80 ఏళ్లకు పైబడిన ఓటర్లు, 9,459 మంది దివ్యాంగ ఓటర్లు, 1.80 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకున్నారని వివరించారు. ఈ నెల 3న ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 33 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, కేంద్ర బలగాలు, రాష్ట్ర సాయుధ రిజర్వ్‌డ్ బలగాలు, రాష్ట్ర పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. 500కుపైగా పోలింగ్ కేంద్రాలున్న 6 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం 14o14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామని.. మిగతా స్థానాల ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఉంటాయని తెలిపారు. ప్రతి టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు ఉంటారని చెప్పారు. 119 స్థానాలకు సంబంధించి 1,766 కౌంటింగ్ టేబుల్స్ ఉంటాయని.. వీటిలో ఆర్వో, పోస్టల్ బ్యాలెట్ల కోసం 131 టేబుల్స్ ఉంటాయని వివరించారు.

**ఉదయం 10.30 కల్లా లీడ్‌పై స్పష్టత**

కౌంటింగ్‌లో తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించి తర్వాత ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓట్లను లెక్కిస్తారని వికాస్‌రాజ్ తెలిపారు. ఒకవేళ పోస్టల్ ఓట్ల లెక్కింపునకు అధిక సమయం పడితే.. సమాంతరంగా ఈవీఎం ఓట్ల లెక్కింపూ మొదలవుతుందన్నారు. ఉదయం 10.30 గంటలకల్లా కౌంటింగ్‌లో ముందంజలో ఉన్న అభ్యర్థుల విషయంలో స్పష్టత వస్తుందని వికాస్‌రాజ్ అంచనా వేశారు. కొన్ని స్థానాల్లో అధిక పోలింగ్ జరగడం, చాలాచోట్లలో ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉండటంతో ఓట్ల లెక్కింపునకు కొంత ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు.

# ఓటర్ల సంఖ్య పెరిగినా.. పోలింగ్ తగ్గింది

**హైదరాబాద్:** రాష్ట్రంలో ఈసారి అర్హులైన ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగినా, ఆ మేరకు ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకోక పోవడంతో పోలింగ్ శాతం తగ్గింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 3,26,02,793 మంది ఓటర్లకు గాను 2,32,59,256 మంది (71.34%) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,62,98,482 మంది పురుషులకు గాను 1,15,84,728 మంది, 1,63,01,634 మంది మహిళలకు గాను 1,16,73,722 మంది, 2,677 మంది థర్డ్ జెండర్ ఓటర్లకు గాను 806 మంది ఓటేశారు. గురువారం నాటి పోలింగ్‌కు సంబంధించిన తుది గణాంకాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) శుక్రవారం రాత్రి విడుదల చేశారు. అత్యధికంగా మునుగోడులో 91.89 శాతం పోలింగ్ నమోదు కాగా..పాలేరు (90.89 శాతం), ఆలేరు (90.77 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అత్యల్పంగా యాకుత్‌పురలో 39.64 శాతం నమోదైంది. మలక్‌పేట (41.32 శాతం), చార్మి నార్ (43.27 శాతం) ఆపై స్థానాల్లో ఉన్నాయి. ఈ సారి ఎన్నికల్లో పురుషుల కంటే మహిళలు అధిక సంఖ్యలో ఓటేయడం గమనార్హం. కాగా 2018లో జరిగిన ఎన్నికల్లో 73.2 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికలతో పోల్చితే ప్రస్తుత ఎన్నికల్లో 1.86 శాతం పోలింగ్ తగ్గింది. 2018 ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో మొత్తం 2.8 కోట్ల మంది ఓటర్లుండగా, 2.05 కోట్ల మంది ఓటేశారు. అయితే ఈసారి ఓటర్ల సంఖ్య భారీగా పెరిగి 3.26 కోట్లకు చేరుకోగా, 2.32 కోట్ల మందే తమ ఓటు హక్కు



వినియోగించుకున్నారు. ఈ కారణంగానే.. 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ప్రస్తుతం 26.78 లక్షల మంది ఎక్కువగా ఓటేసినా, పోలింగ్ శాతం మాత్రం తగ్గింది.

## భారమైన దూరమైన బాధ్యత గా ఓటు వినియోగించుకున్న ఓ ఓటరన్నా....

ఐదు సంవత్సరాల వారి అధికారానికి....
నీచూపుడు వేలు చేసెను నిన్న సహకారం ....
ఎందుకంటే..
నీ ఆయుధానికి పదు నెక్కడనికి పట్టును మరో
ఐదేండ్లు అని...
వచ్చిన అవకాశాన్ని అదును గా తీసుకొని...
ఇచ్చిన హామీలు అందరికి అందాలని...
మెచ్చిన మ్యానిఫెస్టోలు మనకు చేరువ కావాలని...
నచ్చిన నాయకుని చూపావు విజయపు దారిని....
వున్న ఊపు వుండాలని కొందరు...
మార్పు కోసం మరికొందరు.....
ఏదేమైనా నీ వేలు మీది నల్ల గీత...
మార్చును నాయకుల తల రాత....



రచన:
హరినాథ్ రాజు చెన్నమాధవుని,
ప్రిన్సిపాల్.
కృష్ణవేణి టాలెంట్ స్కూల్,
రుద్రంగి. రాజన్న సిరిసిల్ల.

# కాంగ్రెస్ కి మద్దతుగా తమ వంతు ప్రచారాలు

## తెలంగాణ వడ్డెర ఐక్యవేదిక అధ్యక్షులు వేముల యాదయ్య

జూబ్లీహిల్స్, డిసెంబర్ 1 (వాయిస్ టుడే) జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు నా వంతుగా కృషి చేయడం జరిగిందన్నారు. ఎలక్షన్ ప్రచారానికి ఈ 20 రోజులు కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేశామని తెలిపారు. తెలంగాణ వడ్డెర ఐక్యవేదిక తరఫునుంచి మరికొందరు కులస్తులు ఈ ప్రచార కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

తెలంగాణ వడ్డెర ఐక్యవేదికలి జనరల్ సెక్రెటరీ సురేష్ వడ్డెర తెలంగాణ వడ్డెర ఐక్యవేదిక హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ముద్దంగుల శేఖర్ వడ్డెర తెలంగాణ వడ్డెర ఐక్యవేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపు మల్లయ్య ప్రచారం చేశారు.

రహమత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి గారు, ప్రచారానికి చాలా మద్దతు ప్రచారానికిలి ఇవ్వడం




జరిగిందన్నారు సాయ సహకారాలు కాంగ్రెస్ పార్టీ నాయకుడులి బండపల్లి భవాని శంకర్ వంతు సహాయం చేశారు. అధిక మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది మన వడ్డెర కుల బంధువులకు తగిన న్యాయం చేయాలని ఆశిస్తున్నామన్నారు.



## మనుమళ్లతో సరదాగా గడిపిన 'పట్నం' బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నోముల దయానంద్ గౌడ్

ఇబ్రహీంపట్నం, వాయిస్ టుడే: నిత్యం ప్రచారంలో హడావుడిగా గడిపి ఎన్నికల ప్రక్రియ ముగియడంతో కుటుంబసభ్యులు, మనుమలతో ఆడుకుంటున్న ఇబ్రహీంపట్నం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నోముల దయానంద్ గౌడ్.

## భారీ వర్షా లు.. హెచ్చరికలు జారీ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఇవాళ వాయుగుండంగా బలపడనుందని వెల్లడించింది. ఎల్లుండికి తుపానుగా మారుతుందని, దీని ప్రభావంతో పలు చోట్ల ఆది, సోమ వారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. మత్స్య కారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. తుపాను తీవ్రత నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. పంట కోతలపై అవగాహన కల్పించాలని, రైతులకు అందుబాటులో ఉండాలని సూచించింది.

**తుపాను ఎఫెక్ట్: తమిళనాడుకు రెడ్ అలర్ట్**

తమిళనాడును వర్షాలు వణికిస్తున్నాయి. ఇప్పటికే రెండు రోజులుగా దంచికొడుతున్న వానలతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరువళ్లూరు, కాంచీపురం, చెన్నై ప్రాంతాలకు అధికారులు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. అటు, బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి ఈరోజు సాయంత్రానికి వాయుగుండంగా మారనుందని వాతావరణ శాఖ చెబుతోంది. రెండ్రోజుల్లో అది తుపానుగా మారొచ్చని అంచనా వేసింది.

**వణికిస్తున్న చలి**

విశాఖ ఏజెన్సీ ప్రాంతాలను కనిష్ఠ ఉష్ణోగ్రతలు వణికిస్తున్నాయి. గత వారం రోజులుగా ఏజెన్సీలో చలి ప్రభావం పెరుగుతోంది. చింతపల్లిలో కనిష్ఠంగా 11.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పొగమంచుతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం వేళల్లో కాఫీ తోటలు, పంట పొలాలకు వెళ్లే కూలీలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు వణుకుతూ ప్రయాణం చేస్తున్నారు.

## టవర్ సర్కిల్ వద్ద బండి సంజయ్ సందడి

### మామాజి జిలేబీ సెంటర్ వద్ద జిలేబీ తిన్న సంజయ్



కరీంనగర్ డిసెంబర్01(వాయిస్ టుడే)అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ శుక్రవారం కరీంనగర్ టవర్ సర్కిల్ కు వెళ్ళారు. అక్కడ ఉన్న మామాజీ జిలేబి సెంటర్ వద్ద బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి జిలేబీ తిన్నారు. సామాన్య ప్రజలలాగా బండి సంజయ్ అక్కడికి రావడంతో పలువురు షాప్ యజమానులు, ప్రజలు తనను కలవడానికి వచ్చారు. ఈ సందర్బంగా వారి అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో నిన్నటి వరకు బిజీ బిజీగా గడిపిన సంజయ్ కుమార్, నేడు కాస్త ఫ్రీ టైం దొరకడంతో ఇలా సేద తీరారు.

## మేడ్చల్ నియోజకవర్గం గెలుపు పై

# ఎవరికి వారే ధీమా..!

### సంబరాలు షురూ చేసుకోవాలని పిలుపు

మేడిపల్లి, డిసెంబరు 01 (వాయిస్ టుడే) : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో గెలుపు పై ఎవరి దిమాలో వారు ఉన్నారు. ముచ్చటగా మూడోసారి విజయం సాధిస్తామని బిఆర్ఎస్, తమదే అధికారం అని కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. ఈనెల 3న సంబరాలు చేసేందుకు రెడీగా ఉండాలని రెండు పార్టీలు తమ కేడర్ కు పిలుపు నిచ్చాయని సమాచారం, పోలింగ్ పూర్తయిన వెంటనే అటు కేటీఆర్ ఇటు పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఎవరికి వారే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. మేడిపల్లిలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం, మేడిపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రెండు పార్టీల కార్యాలయాల వద్ద కార్యకర్తల సందడి నెలకొంది. తమ పార్టీనే పవర్ లోకి వస్తుందని ఉత్సాహంతో కార్యకర్తలు కనిపించారు.

# కౌంటింగ్ సెంటర్ వద్ద పటిష్ట బందోబస్తు

### కమిషనరేట్ లోని అన్ని విభాగలకు చెందిన పోలీస్ అధికారులందరిని అభినందించిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మహంతి ఐ.పి.ఎస్




కరీంనగర్ డిసెంబర్ 01(వాయిస్ టుడే)కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలు నందు శుక్రవారం నాడు అన్నీ పోలీస్ స్టేషన్ల మరియు వివిధ విభాగాలకు చెందిన అధికారులందరితో పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఐపీఎస్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కమిషనరేట్ వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ ముగిసిందని ఆయన అన్నారు. పటిష్టమైన ప్రణాళిక, క్రమశిక్షణతో అధికారులందరూ పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా అన్ని స్థాయిలకు చెందిన అధికారులు పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎంతో అప్రమత్తంగా ఉంటూ వారికి కేటాయించబడ్డ విధులు సక్రమంగా నిర్వహించారన్నారు. దీనికిగాను అన్ని విభాగాలకు చెందిన అన్ని స్థాయిలకు చెందిన అధికారులందరినీ ప్రత్యేకంగా అభినందించారు.

అనంతరం మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ ముగిసినప్పటికీ, పోస్ట్ పోలింగ్ ఇంకా మిగిలి ఉందని అధికారులు మరియు సిబ్బంది గుర్తించాలన్నారు. డిసెంబర్ 3వ తేదీన ఎన్నికల కమీషన్, ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. దీనికిగాను కరీంనగర్ లోని నాలుగు నియోజకవర్గాలయిన కరీంనగర్, చొప్పదండి,మానకొండూర్, హుజూరాబాద్ లకు చెందిన ఈవీఎంలను స్థానిక ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు స్ట్రాంగ్ రూమ్ లు ఏర్పాటు చేసి వాటిని అవసరమయిన భద్రత కలిపించామన్నారు. ఇదే కళాశాల యందు నియోజకవర్గాల కౌంటింగ్ సెంటర్ లను ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్ రూముల భద్రతకై కేంద్ర సాయుధ బలగాలని కేటాయించమన్నారు. కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా మరియు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన పటిష్ట బందోబస్త్ ప్రణాళిక సిద్ధం చేశామని మరియు అవసరమైన అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఓటింగ్ ప్రక్రియ ముగిసే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ విధుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. విధుల్లో ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దన్నారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రశాంతంగా ముగిసేలా నిబద్ధత తో విధులు నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ.లక్ష్మీనారాయణ(శాంతి భద్రతలు), సి.రాజు, (పరిపాలన), ఏసీపీలు నరేందర్ (టౌన్), కరుణాకర్ రావు(రూరల్) జీవన్ రెడ్డి (హుజూరాబాద్), శ్రీనివాస్ (సి.ఎస్.బి), సర్వర్ (ట్రాఫిక్) విజయ్ కుమార్ (సీ.సీ.ఆర్.బి/ ఎలక్షన్స్ సెల్), కాశయ్య (ఐటీ సెల్ ),మాధవి (సి.సి.ఎస్), వేణు (సి టి సి), ప్రతాప్ (ఎ.ఆర్.) అన్నీ పోలీసు స్టేషన్ లకు చెందిన ఎస్.హెచ్.ఓ లు, హెడక్వార్టర్స్ కి చెందిన ఆర్.ఐ. లు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణలో కౌంటింగ్‌కి ఈసీ ఏర్పాట్లు




హైదరాబాద్ : తెలంగాణలో పోలింగ్ ఘట్టం ముగిసింది. ఇక మిగిలింది కౌంటింగ్.. దీనిపై ఈసీ కసరత్తు చేస్తోంది. 119 నియోజకవర్గాల కౌంటింగ్ కోసం 49 కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ ప్రారంభం కానున్నట్టు ఈసీ ప్రకటించింది. హైదరాబాద్ పరిధిలో 15 ప్రాంతాల్లో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది ఈసీ..ఇక ఈవీఎంలను భద్రపరిచిన.. స్ట్రాంగ్ రూంల దగ్గర మూడెంచల భద్రత ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో.. తెలంగాణ పోలీసులుతో పాటు.. పారా.. సాయుధ బలగాలు పహారా ఉండనుంది. స్ట్రాంగ్ రూంకి డబుల్ లాక్ సిస్టం ఏర్పాటు చేసినట్టు ఈసీ పేర్కొంది. ఒక వేళ పొలిటికల్ లీడర్లకు ఏదైనా అనుమానం ఉంటే.. స్ట్రాంగ్ రూం దగ్గరే ఉండొచ్చని.. ఈసీ తెలిపింది.

## రామగుండంలో బీ.ఆర్.ఎస్ పార్టీ గెలుపు కాయం! : కోరుకంటి చందర్




పెద్దపల్లి జిల్లా: డిసెంబర్. 1 (వాయిస్ టుడే) గోదావరిఖని. రామగుండం నియోజకవర్గంలో ప్రజల ఆశీస్సులతో, బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తల నిర్విరామ కృషితో తిరిగి తానే ఎమ్మెల్యేగా గెలువబోతున్నానని, రానున్న అయిదేళ్లలో ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తానని, మరింత మెరుగైన సేవలందిస్తానని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు.

స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన పార్టీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు దాదాపు రెండు నెలల పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ, గడపగడపకూ తీసుకెళ్లడంలో సఫలీకృతులయ్యారని, తన గెలుపే లక్ష్యంగా కృషి చేసారని కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ధర్మం దిక్కు, న్యాయం వైపే ఉన్నారని, ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో, తనతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన లబ్ధిదారులు, ప్రజలు స్పందించిన తీరు అమోఘమని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్గం జడ్పిటిసి ఆముల నారాయణ, కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, ఎన్ వి రెడ్డి, బాదే అంజలి, కో ఆప్షన్ మెంబర్ తస్నీమ్ భాను, పిటి స్వామి, కౌశిక హరి, గోపు ఐలయ్య యాదవ్, పర్లపల్లి రవి, మెతుకు దేవరాజ్, జేవిరాజు, కాల్వ శ్రీనివాస్, నూతి తిరుపతి, పిల్లి రమేష్ నారాయణ, దాసరి ఎల్లయ్య, దాసరి శ్రీనివాస్, మేకల సమ్మయ్య, గాదం నందు, బండరాజు, కొర్రి ఓదెలు, చింటూ, సంధ్యారెడ్డి, స్వాతి, కళావతి, రమ్య యాదవ్, సమ్మెట సప్న, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవంపై అవగాహన...!




పెద్దపల్లి జిల్లా: డిసెంబర్. 1 (వాయిస్ టుడే) గోదావరిఖని స్థానిక శారదా నగర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేడు అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళశాల ప్రిన్సిపాల్ ఖాజౌ జౌహీర్ అహ్మద్ అధ్యక్షత వహించగా డా. లక్ష్మీవాణి మరియు డా. వన ముఖ్య వక్తలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎలా సంక్రమిస్తుంది. దీనిని సంక్రమించకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి. దాని నివారణ మార్గాలు మొదలగు అన్ని అంశాల మీద విద్యార్థులకు ఎంతో అవగాహన కల్పించారు. ఎయిడ్స్ రోగుల పట్ల మనము ఎంతో ప్రేమ అభిమానముతో ఉంటూ వారిలో మనోధైర్యాన్ని నింపాలని కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'రంగోలి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఖాజౌ జౌహేర్ అహ్మద్, డా. లక్ష్మీవాణి మరియు డా. వనజ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో సుబ్బారావు, శారదా. డా. కిరణ్మయి, ఉషారాణి. సభ్యులు, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం కళశాల నుండి మున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాత్ ద్వారా ప్రజలలో వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ ఆధ్వర్యంలో ర్యాతిని నిర్వహించడం జరిగింది.


## లారీ డీ ... వృద్ధ మహిళ మృతి

తొర్రూర్ వాయిస్ టూడే డిసెంబర్ 1: ఉదయం సుమారు 10 గంటల సమయం లో తొర్రూర్ మండలం నాంచారిమడూర్ గ్రామాని కి చెందిన గుడిగుండ్ల వెంకటమ్మ భర్త, పేరు, బీ.రయ్య, 57, సంవత్సరాలు, కురుమ, మహిళ వృద్దురాలు నాంచారిమడూర్ అంబేద్కర్ కూడలి వద్ద కిరాణం షాప్ కు వెళ్లి రోడ్డు దాటుతున్న క్రమం లో తొర్రూర్ నుండి పాలకుర్తి వైపు వెళ్ళు చున్న లారీ ఏపి 39 టియు 5410 నెంబర్ గల లారీ ని నడిపే డ్రైవర్ అతి వేగం తో అజాగ్రత్త,నిర్లక్ష్యం గా నడిపి రహదారి దాటుతున్న వృద్ధ మహిళ ను ఢీ కొట్టడం తో తీవ్ర గాయాల తో మహిళ మృతురాలు అక్కడికక్కడే మృతి చెందినది.

# కౌన్ బనేగా హుజూరాబాద్ కా బాద్ షా ...

వాయిస్ టుడే, జమ్మికుంట: హుజూరాబాద్ ఎం ఎల్ ఏ ఈటల రాజేందర్ బి ఆర్ ఎస్ పార్టీ వీడిన తరువాత దేశమంతా ఎంతో ఆసక్తిగా చూశాయి బై ఎలక్షన్స్ నీ అందరూ ఊహించినట్లుగానే తన స్థానాన్ని దక్కించుకున్నారు. బి జె పి నుండి పోటీ చేసి కానీ ఈ సారి గెలుపు ఎవరిది అనేది ఉత్కంఠగా మారింది.

20 ఎండ్లుగా ఇక్కడ ఎం ఎల్ ఏ గా గెలుస్తూ వస్తున్న ఈటల నా, బి ఆర్ ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి దా, లేక కాంగ్రెస్ బలపరిచిన వొదితల ప్రణవ్ దా అనే వుత్కంట నెలకొంది ఇక్కడి నియోజక వర్గం లో. ప్రజల తీర్పు ఎటు వైపు ఉందో డిసెంబర్ 3 వరకు వేచి చూడాలి.



వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
శనివారం, 25 నవంబరు, 2023

## ప్రభుత్వ హాస్పిటల్ పై దాడి చేసినవారిపై కేసు నమోదు : యస్ ఐ దత్తాత్రి



జగిత్యాల జిల్లా బ్యూరో (డిసెంబర్ 01) వాయిస్ టుడే : శుక్రవారం సుమారు 07 గంటలకు ధర్మపురి దోనూరు గ్రామానికి చెందిన మామిడి రామయ్య అను వ్యక్తి పొలం పని నుండి ఇంటికి వస్తు మార్గమధ్యమంలో పడిపోయి నందున అదే సమయంలో కుటుంబ సభ్యులు జగిత్యాల జిల్లా ధర్మపురి గ్రామంలోని ప్రభుత్వ సి యచ్ సి హాస్పిటల్ తీసుకువచ్చినారు. అతనిని డాక్టర్ పరిశీలించారు. తనకి పల్స్ లేదని చెప్పి నందున దోనూరు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ హాస్పిటల్ పై దాడి చేయడం జరిగింది. అలాగే ప్రభుత్వ ఆస్తి నష్టపరిచినారు, ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేసినారు. ఇలా చేసిన వారిపై కేసు నమోదు చేయడం జరిగినది. దర్యాప్తు జరుగుచున్నది అని ధర్మపురి యస్ ఐ దత్తాత్రి తెలిపారు.

## ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సెయింట్ మెరిస్ పాఠశాలలో ఎయిడ్స్ పై అవగాహన ప్రోగ్రాం



నర్సంపేట ( వాయిస్ టుడే ) నర్సంపేట నియోజక వర్గం మహేశ్వరం గ్రామంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో నిర్వహించిన ఎయిడ్స్ డే సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జయప్రద మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం డిసెంబర్ మొదటి తేదీన జరుపుకుంటారు, ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని మొదటిసారిగా 1988లో ప్రకటించారు, ఎయిడ్స్ అనేది వైరస్ వల్ల కలిగే వ్యాధి. హెచ్.ఐ.వి, అది మానవ అప్లస్టాపర్ శరీరంలోకి ప్రవేశించినప్పుడు, వ్యక్తి యొక్క రోగనిరోధక శక్తిని పూర్తిగా దెబ్బతీస్తుంది, ఎయిడ్స్ తీవ్రమైన ఇన్ఫెక్షన్లు మరియు ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది, ఔషధం మరియు సరైన చికిత్స తీసుకోకపోతే రోగి చనిపోవచ్చు. వ్యసనాలకు మరియు చెడు అలవాటులకు లోను కాకుండా ఉండాలని పిల్లలకు చెప్పారు ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన మైమ్ యాక్షన్ పిల్లలను ఎంతో ఆకర్షించింది ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ మరియా గోరేటి,ఉప ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ రాష్మిత, మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొనడం జరిగింది.

## యశశ్విని రెడ్డి విజయం ఖాయం



రాయపర్తి, డిసెంబర్ 1 (వాయిస్ టుడే): పాలకుర్తి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్ ఆశాభావం వ్యక్తం శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు పాలకుర్తి నియోజకవర్గం లో కాంగ్రెస్ జెండా ఎగరడం జరుగుతుందని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని అన్నారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిపి లక్ష్యంగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు,కార్యకర్తలకు,మహిళలకు,యువకులకుప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంతృత్వం పాలన అంతమొందించాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ముద్రబోయిన వెంకటేశ్వర్లు, పెండ్లి మహేందర్ రెడ్డి, మచ్చ నీలయ్య, సరికొండ కృష్ణారెడ్డి, ఎనగందుల మురళి,కుంట రమేష్, సోడెపు శ్రీనివాస్, మచ్చ రమేష్,ఐత ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో పాడి గేదె మృతి



తొర్రూరు, డిసెంబర్ 01 (వాయిస్ టుడే): మండలంలోని చర్లపాలెం గ్రామానికి చెందిన సముద్రాల మల్లయ్య తండ్రి వీరయ్య కు ఉన్న గేదె మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్ ఫార్మర్ విద్యుత్ వైర్లు తగలడంతో షాక్ తో శుక్రవారం మృతి చెందింది. ఈ సందర్భంగా బాధితుడు మల్లయ్య మాట్లాడుతూ రోజువారిగా తమకు ఉన్న వ్యవసాయ పొలం వద్ద మేత మేస్తుండగా విద్యుత్ వైర్లు కిందికి ఉండడంతో వైర్లకు కలిగి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదెకు సుమారు రూ. 50 వేల వరకు ఉంటుందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

# ఓట్లను గల్లంతు చేసిన అధికార ప్రభుత్వం: అడ్లూరి

- తమ కుటిల బుద్దిని ప్రదర్శించింది
- నియోజకవర్గ ప్రజల అభిమానం, లక్ష్మీనరసింహస్వామి దయతో తాను గెలుపొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి



జగిత్యాల జిల్లా బ్యూరో (డిసెంబర్ 01) వాయిస్ టుడే :గురువారం జరిగిన ఎన్నికలకు సంబంధించి ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈసందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ ఈసారి తమ నియోజకవర్గ ప్రజల అభిమానంతో, లక్ష్మీనరసింహస్వామి దయతో తాను గెలుపొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు.గత కొద్ది రోజులుగా తనకోసం అహర్నిశలు కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలకు,నాయకులకు ఎంతో అభిమానంతో తనకు ఓటు వేసిన తన నియోజకవర్గ ప్రజలకు లక్ష్మణ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.బి ఆర్ యస్ ప్రభుత్వం యొక్క అరాచక పాలనను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఇప్పుడు జరిగే ఎన్నికల్లో బి ఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఈ సందర్భంగా తెలియజేశారు.గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన 32 సంవత్సరాల ఓరుగంటి మహేష్ అనే యువకుడు చనిపోగా తన కొడుకు అంత్యక్రియలను జరిపి మరి తన గెలుపు కోసం వచ్చి ఎంతో బాధలో ఉన్న గాని ఓటు హక్కును వినియోగించుకొని ఓటు వేయడం జరిగింది. అంత దుఃఖంలో కూడా తనపై ఉన్న అభిమానానికి ఆ తల్లికి తాను ఒక కొడుకుని అయ్యి ఆ తల్లికి జీవితాంతం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా తెలియజేశారు.అంతేకాకుండా వెల్గటూరు మండల కేంద్రంలో సర్పంచ్ మురళి తో సహా దాదాపు 150 మంది ఓట్లను గల్లంత చేసి అధికార ప్రభుత్వం తమ కుటిల బుద్దిని ప్రదర్శించిందని రేపటి మూడో తారీకు తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని మీ అవినీతి పాలనకు అంతమందించాల్సిన సమయం ఆసన్నమైందని ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ తెలియజేశారు.

# భారీ మెజారిటీతో గెలుస్తా...!

### నా గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

### మీడియా సమావేశంలో చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ , డిసెంబర్ 1 వాయిస్ టు డే ప్రతినిధి : హనుమకొండ బాలసముద్రంలోని బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్ వీప్ దాస్యం వినయ్ భాస్కర్ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఆశీర్వాదంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో భారీ మెజారిటీతో గెలవబోతున్నానని దీమాను వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 56% పోలింగ్ జరిగిందని, ఇందులో ఎక్కువ శాతం మహిళలు, యువతీ, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొని ఓటింగ్ లో పాల్గొన్నారని అన్నారు. తన కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. అందరి సహకారంతో క్షేత్రస్థాయిలోని విషయాలను కూడా సమాచారం అందించి, నా గెలుపు కోసం కృషి చేసిన మీడియా మిత్రులకు, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కెసిఆర్ సంక్షేమ ఫలాలు తన గెలుపు కు కారణం అన్నారు.ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేస్తానని, ఏది ఏమైనాప్పటికీ మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. 66 నుండి 69 సీట్లు గెలవడం ఖాయం అన్నారు. గతంలో కంటే ఎక్కువ మెజారిటీతో గెలవబోతున్నానని అన్నారు.

తన గెలుపుతో మరింత బాధ్యత పెరిగి బాధ్యతాయుతంగా మరిన్ని అభివృద్ధి,సంక్షేమ పథకాలు, మరిన్ని పనులు చేస్తానని అన్నారు.కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి,తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు,కూడా చైర్మన్ సుందర్ రాజు యాదవ్,మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్ జనార్ధన్ గౌడ్, పలువురు కార్పొరేటర్లు,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు సిద్ధం చేయండి

### జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ ప్రావీణ్య

**వరంగల్ జిల్లా పరిధి లోని 3 నియోజక వర్గాల కౌంటింగ్ కు ఏర్పాట్లు...**

వరంగల్, 1 డిసెంబర్, వాయిస్ టుడే ప్రతినిధి : ఎన్నికల ఓట్ల లెక్కింపు కు ఏర్పాట్లు చేయాలనీ జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు.

శుక్రవారం ఏనుమాముల మార్కెట్ యార్డ్ లో కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు షణ్ముగ రాజన్ రిటర్నింగ్ అధికారులు షేక్ రిజ్వాన్ బాషా, అశ్విని తానాజీ వాకడే, కృష్ణవేణి లతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గ వర్గాలలో పోలింగ్ నిర్వహించిన ఫామ్ 17 సి పరిశీలించారు.

ఈ సందర్భంగా సాధన పరిశీలకులు మాట్లాడుతూ మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అన్ని సక్రమంగా ఉన్నాయని, స్క్రూటినీ పూర్తయిందని అన్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్, అబ్జర్వర్ సమర్పించిన పోలింగ్ ఓట్ల వివరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నియోజకవర్గాల్లో సక్రమంగా పోలింగ్ నమోదు ప్రక్రియ జరిగిన నేపథ్యంలో ఎక్కడ కూడా రీపోలింగ్ చేయాల్సిన అవసరం లేదని కౌంటింగ్ ఏర్పాట్లు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, సాధారణ పరిశీలకులు షణ్ముగ రాజన్ రిటర్నింగ్ అధికారులతొ కలసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఫారం 17సి ధ్రువపత్రాలు ఆయా గోడౌన్ లలో భద్రపరచి సీల్ వేయడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ ప్రావీణ్య,వరంగల్ (తూర్పు)రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ భాషా అశ్విని తానాజీ వాకడే, కృష్ణవేణితో కలిసి ఏనుమాముల మార్కెట్ యార్డ్ లలో వేర్వేరుగా 3 కేంద్రాల్లో ఈ నెల 3న నిర్వహించే కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించి పక్కద్బందీ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో ఆర్ డి ఓ వాసు చంద్ర, ఎంఓ అబిద్ అలీ, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ నాగేశ్వర్ రావు, ఈ ఈ లు రాజయ్య,సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా చండిక అమ్మవారికి పంచామృత అభిషేకం



పాలకుర్తి, డిసెంబర్ 01(వాయిస్ టుడే) : పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రముఖ ప్రసిద్ధిగాంచిన అతి పవిత్రమైన పుణ్యక్షేత్రమైన స్వయంభు శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవాలయములో పురస్కరించుకుని శ్రీ చండికాదేవికి శ్రీసూక్త విదానేన పంచామృతా అభిషేకం, పట్టువస్త్రులతో మరియు సుగంధద్రవ్యలతో విశేష అలంకరణ,శ్రీ లలితా సహస్రనామ పారాయణం నీరాజన మంత్ర పుష్పములు తీర్థ ప్రసాద వితరణ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బి లక్ష్మీ ప్రసన్న, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## సీఐ కొడుకు ర్యాష్ డ్రైవింగ్.. మహిళ మృతి



హనుమకొండ, డిసెంబర్ 1, వాయిస్ టు డే ప్రతినిధి : హనుమకొండ జిల్లా కాజీపేటలో గురువారం దారుణం జరిగింది. ఎక్సైజ్ సీఐ శరత్ కుమారుడు వంశీ అనే వ్యక్తి ర్యాష్ డ్రైవింగ్ మూలంగా కవిత అనే ఓ మహిళ ప్రాణాలు బలితీసుకుంది. గురువారం కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ నుండి ఓటు వేసిన అనంతరం బయటికి వచ్చి ఆ మహిళ తన భర్త బైకు ఎక్కుతుండగా మహిళను కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఢీకొన్న కారు నెంబర్ TS03 FA 9881 గుర్తించారు. చనిపోయిన మహిళకు ఇద్దరు కుమార్తెలు ఉండగా.. పోలీసులు పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని ఆమె కుటుంబ సభ్యులు కాజీపేట పోలీస్ స్టేషన్ ముందు శుక్రవారం ఆందోళనకు దిగారు.పోలీస్ అధికారి కొడుకుని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని బంధువుల ఆరోపణ చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని ఫాతిమా నగర్ జంక్షన్లో ధర్నా చేయడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

## బాలురు వసతి గృహానికి న్యాయమూర్తి ఆకస్మిక తనికి



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్1) కొత్తగూడెం, జిల్లా న్యాయ సేవాధీకార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, శుక్రవారం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ / జూనియర్ కళాశాల, పాల్వంచ బాలుర వసతి గృహానికి ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగ వసతి గృహం తరగతి గదులు, కిచెన్ రూం, స్టోర్ రూమ్ లను న్యాయమూర్తి పరిశీలించారు. పారిశుధ్యం పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. సౌచాలయాలు, వసతి గృహ ఆవరణం శుభ్రంగా లేకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు.

## తిరుపతిలో మొబైల్ హంట్ అప్లికేషన్ సేవలు

**చోరీకి గురైన 2230 ఫోన్లు రికవరీ**



తిరుపతి, డిసెంబర్ 1: తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం రూ.1.08 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లు రికవరీ చేసింది. మొబైల్ హంట్ అప్లికేషన్ ద్వారా భారీగా మొబైల్ ఫోన్ రికవరీ చేసింది. గత 2 నెలల వ్యవధి లో 600 మొబైల్ ఫోన్స్ రికవరీ చేసిన పోలీసులు ఇప్పటి దాకా 7 విడతల్లో చోరీకి గురైన రూ.4.01 కోట్ల విలువైన మొబైల్ ఫోన్స్ రికవరీ చేసింది. సిటిజన్ పోర్టల్ ద్వారా మొబైల్ పోయిన వెంటనే ఫిర్యాదు చేస్తే సెల్ ఫోన్లలో ఉన్న సమాచారం కూడా దుర్వినియోగం కాకుండా సెల్ ఫోన్ బ్లాక్ అవుతుందని యంత్రాంగం పేర్కొంది.

## నిశ్శబ్ద వాతావరణం తలపిస్తున్న ప్రధాన పార్టీలు

- గెలుపు పై ఎవరిదీ మా వారిదే
- ప్రధాన పోటీ బిజెపి బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉండవచ్చని అంచనా







ముధోల్ : నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గం లో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది దీంతో నిన్నటి నుండి వెలువడిన ఎగ్జిట్ పోల్స్ తో నియోజకవర్గం అంతా ఆసక్తిగా ఎవరు గెలుస్తారు అని ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా బిజెపి బీఆర్ఎస్ పార్టీలు ఎవరు గెలుపు వారు ధీమా వ్యక్తం చేస్తుండడం నియోజకవర్గం శాసనసభ సభ్యుడు ఎవరని ఓవైపు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

దీంతో ఆయా పార్టీల ప్రధాన ఆఫీసుల వద్ద నిశ్శబ్ద వాతావరణం తలపిస్తుంది ఒకవైపు తమ నాయకుడు గెలుపు ఖాయమని చెబుతున్నప్పటికీ అవన్నీ మేకపోతు గాంభీర్యంగా కనిపిస్తున్నాయి గెలుపు నల్లేరుల నడక అన్నట్టు కాకుండా బిజెపి బి ఆర్ ఎస్ ల మధ్య హొరాహొరీ పోరు తప్పదు అనే సాంకేతాలు కనిపిస్తున్నాయి.

ఇప్పటికే నియోజకవర్గంలోని ఆయా మండలాల నుండి ప్రధాన పార్టీ నాయకులు ఓటింగ్ శాతం ఎంత మంది ఓట్లు వేశారు అని లెక్కలు కడుతూ తమ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చి ఉంటాయని అంచనాలు మునిగిపోయారు మరోవైపు నియోజకవర్గ తమ నాయకుడు గెలుపు ఖాయమని చెప్తున్నారు. నియోజకవర్గ మంతట 80 24% ఓటింగ్ నమోదు అయ్యింది దీంతో మరో రెండు రోజుల్లో విడుదలయ్యే ఫలితాలపై నియోజకవర్గమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఇదిలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా వెలువడిన ఎగ్జిట్ పోల్స్ తో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని రాబోయే రోజుల్లో తమ జీవితాలు మారుతాయి అని కొందరు బెట్టింగులు సైతం కట్టడం విశేషం.

## రేడియంట్ విద్యార్థినికి కరాటేలో బంగారు పతకం..




మఖ్తల్ డిసెంబర్ 01 వాయిస్ టుడే ప్రతినిధి : 19వ డబ్లూ కే ఐ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ లో రేడియంట్ హై స్కూల్ విద్యార్థి పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు మెడల్ సాధించారు, అక్కయ్యపాలెం ఫోర్ట్ స్టేడియం లో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ లో రేడియంట్ పాఠశాల విద్యార్థిని వై హరిప్రియ అండర్ 13 ఇయర్స్ -35 కేజెస్ విభాగంలో బంగారు పతకం సాధించారు. ఈ కరాటే పోటీల్లో ముఖ్య అతిథిగా సినిమా హీరో సుమన్ తల్వార్ పాల్గొని ..గెలుపు పొందిన విద్యార్థులను అభినందించారు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు మరియు స్కూల్ మేనేజ్మెంట్ కు ఎంతో గాను మెచ్చుకున్నారు. స్కూల్లో చదువుతోపాటు కరాటే ఎంతో అవసరమని శారీరక ధృఢంగా తయారవుతారని అన్నారు. డ్రాగన్ షోటోకన్ కరాటే డు స్పోర్ట్స్ టోర్నమెంట్ ఇంచార్జ్ మొహమ్మద్ సలీం తెలిపారు.

## అనుమాన స్థితిలో యువకుడు ఆత్మహత్య

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా : రాజాపూర్ మండల కేంద్రంలో శ్రీ మల్లికార్జున ట్రాక్టర్ మెకానిక్ వర్క్స్ శివ అనే యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలిసింది. మహబూబ్ నగర్ వీరన్నపేటకు చెందిన శివ రాజాపూర్ మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రి సమీపంలో అద్దెకు ఉంటూ రాజాపూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శ్రీ మల్లికార్జున ట్రాక్టర్ మెకానిక్ షెడ్డులో ట్రాక్టర్ మెకానిక్ చేస్తున్నాడు. రాత్రి వరకు యువకులతో కలిసి ఉన్న శివ ఉదయం తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు తీయగా అప్పటికే ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న రాజాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలిస్తున్నారు.

## మఖ్తల్ లో 77.13 పోలింగ్ శాతం నమోదు

మఖ్తల్ డిసెంబర్ 01 వాయిస్ టుడే ప్రతినిధి : మఖ్తల్ నియోజకవర్గంలో పోలింగ్ 77.13 శాతం నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ రోజు సమయం ముగిసిన తర్వాత కూడా ఓటర్లు క్యూ లైన్లలో ఉండటంతో రాత్రి వరకు పోలింగ్ సాగిందని, దీంతో చివరివరకు నమోదైన పోలింగ్ 77.13 శాతంగా తెలిపారు. మొత్తం ఓటర్లు 2,42,254 మంది ఉండగా....1,86,860 మంది ఓట్లు వేశారని అన్నారు. ఇందులో పురుషులు 94,140 మంది కాగా, మహిళలు 92,719 మంది ఉన్నారు. ఇక ఇతరులు ఒకరు ఉన్నారు. మండలాలవారీగా చూస్తే ఉట్కూర్ మండలంలో 44,272 మంది ఓటర్లకు 33,548 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, ఇక్కడ 75 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక అమరచింతలో 22,542 మంది ఓటర్లు ఉండగా, 18,435 మంది ఓటు హక్కు వేయగా, 81 శాతం పోలింగ్ నమోదైంది. ఇక ఆత్మకూరులో 30,563 మంది ఓటర్లు




ఉండగా...24,158 మంది ఓటు హక్కు వేయగా, ఇక్కడ 79 శాతం పోలింగ్ నమోదైంది. ఇక క్రిష్ణ మండలంలో 21968 మంది ఓటర్లు ఉండగా...15,664 మంది ఓటు వేయగా, ఇక్కడ 71 శాతం నమోదైంది. మాగనూరులో 19099 మంది ఓటర్లు ఉండగా...15664 మంది ఓటు వేయగా, 82 శాతం పోలింగ్ నమోదైంది. ఇక మఖ్తల్ మండలంలో 65,326 మంది ఓటర్లు ఉండగా...48,354 మంది ఓటు వేయగా, 74 శాతం పోలింగ్ నమోదైంది. ఇక నర్వ మండలంలో 27,818 మంది ఓటర్లు ఉండగా...22,363 మంది ఓటేశారు. దీంతో ఇక్కడ 80 శాతం పోలింగ్ నమోదైంది. ఇక మరికల్ మండలంలో 8711 మంది ఓటర్లు ఉండగా...6915 మంది ఓటేయగా..79 శాతం పోలింగ్ నమోదైంది. చివరగా మదనాపూర్ మండలంలో 1955 మంది ఓటర్లు ఉండగా... 1683 మంది ఓటేయగా...86 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా అన్ని మండలాల్లో కలిపి 186860 మంది ఓట్లు వేయగా... 77.13 శాతం నమోదైంది. అత్యధికంగా మదనాపూర్ మండలంలో 86 శాతం, ఆ తర్వాత మాగనూరు మండలంలో 82 శాతం, అమరచింతలో 81 శాతం, నర్వ మండలంలో 80 శాతం అధికంగా పోలింగ్ నమోదైంది.

**గత ఎన్నికల్లో నమోదైన ఓట్లు...1,64,409.. పోలింగ్ 77 శాతం...**

గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ మఖ్తల్ నియోజకర్గంలో 77 శాతం పోలింగ్ నమోదైంది. అయితే ఆ ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 1,98,163 మంది ఉండగా, 1,64, 409 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## మా పార్టీకి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు

**బిఎల్ఎఫ్ కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సిద్ధిరాములు**



కామారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 1 (వాయిస్ టుడే) : ప్రజాస్వామ్యాన్ని కాపాడే దిశలో తమ అమూల్యమైన ఓటు హక్కును కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు వినియోగించుకుని ఓటు వేశారని, బిఎల్ఎఫ్ బలపరిచిన,బిఎల్ పి,పార్టీ కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సిరిగాద సిద్ధిరాములు అన్నారు. తాను ఎన్నికల్లాలో పోటీ చేసిన సందర్భంగా ఇన్ని రోజులు తనతో ఉండి తనకు సహకరించిన తన తోటి మిత్రులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పౌరుడి చేతిలో ఉన్న గొప్ప ఆయుధం ఓటు అని, ఆ ఓటును సద్వినియోగం చేసుకున్న కామారెడ్డి నియోజికవర్గం ఓటర్లకు ఆయన అభినందనలు తెలిపారు. ఉదయం కామారెడ్డి లో తన ఓటు వేసిన అనంతరం, కామారెడ్డి నియోజికవర్గం లోని వివిధ పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి ఎన్నికల ప్రక్రియను పరిశీలించరు.

కొన్నిచోట్ల ఉద్రిక్తత నెలకొన్నప్పటికీ పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి సహకరించిన నియోజకవర్గ ప్రజలకు, పోలీసులకు, ప్రభుత్వ ఎన్నికల అధికారులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## అత్యంత భద్రతల మధ్య ఈవీఎంల భద్రత

**జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా**






(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే డిసెంబర్1) అత్యంత భద్రత మధ్య ఈవీఎంల బద్రపరిచినట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. 30వ తేదీన జిల్లా పరిధిలోని ఐదు నియొకవర్గాల్లోని 1098 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ నిర్వహించామని చెప్పారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో రిసిప్షన్ కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్ స్వీకరించామని చెప్పారు.

పాల్వంచ మండలం, అనుబోస్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో మూడంచల భద్రత మధ్య భద్రపరిచినట్లు చెప్పారు. ఈ నెల మూడో తేదీన కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియకు ప్రతి నియోజకవర్గానికి 14 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పర్యవేక్షణకు 18 టీములు ఏర్పాటు చేశామని, ప్రతి టేబుల్ కు ఒక సూక్ష్మ పరిశీలకులు, కౌంటింగ్ సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓట్లు లెక్కింపు పరిశీలకులు కమల్ కిషోర్, హరి కిషోర్, గణేష్, భద్రాచలం ఏఎస్పి పరితోష్ పంకజ్, అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రతీక్ జైన్, రాంబాబు, కార్తిక్, శిరీష, మంగిలాల్, ఆర్ అండ్ బి ఈ ఈ భీంలా తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన అవసరం

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి**




భద్రాద్రి కొత్తగూడెం వాచ్ టుడే డిసెంబర్ : ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు అందరు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగ శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల,చుంచుపల్లి మండలం లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో న్యాయమూర్తి ముఖ్య అతిథిగ పాల్గొన్నారు. ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పాటించాలని తెలిపారు.

యుక్త వయసు వారు సరైన అవగాహన లేకపోవడం వల్ల ఈ మహమ్మారి బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు.

ఎయిడ్స్ సోకిన వారిని చులకనగ చూడవద్దని, వారి పట్ల వివక్ష చూపరాధని తెలిపారు. కొత్తగూడెం గవర్నమెంట్ హాస్పిటల్ చర్మ వ్యాధుల డాక్టర్ మోహన కృష్ణ రెడ్డి హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యలకు బానిస కావద్దని సూచించారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల ఏమైన అనుమానం ఉన్నట్లయితే తక్షణమే పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. యువత చెడు మార్గాలను ఎంచుకొని హెచ్ఐవి ఎయిడ్స్ బారిన పడుతున్నారని అన్నారు. ఎయిడ్స్ వ్యాధి ఉన్నవారితో సహజీవనం, కలిసి ఉండటం, కలిసి భుజించడం వలన వ్యాధి రాదని, రక్త మార్పిడి, సూదులు, లైంగిక సంబంధాల వల్ల వ్యాధి సోకుతుందని తెలిపారు.

ఈ వ్యాధి పట్ల విద్యార్థులకు కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఎంతైన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ కుమార్ మక్కడ్, జనరల్ సెక్రెటరీ ఆర్. రామారావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తం రావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి. నిరంజన్ రావు, న్యాయవాదులు లక్కినేని సత్యనారాయణ, మెందు రాజమల్లు, శ్రీనివాసరావు,కళాశాల ప్రిన్సిపల్ జె.రమేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ జ్యోతి విశ్వకర్మ, నాగ స్రవంతి కళాశాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రామగుండంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం : రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్



పెద్దపల్లి జిల్లా: డిసెంబర్. 1 (వాయిస్ టుడే) గోదావరిఖని : రామగుండంలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది. ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో గెలవబోతున్నను రామగుండం ప్రాంతం పూర్తిగా నిర్లక్షనికి గురైంది. దోపిడి పాలనపై విసుగు చెంది.. ప్రజలు మార్పు కోరుకున్నారు. ఈ నెల 3న రామగుండం ప్రాంతానికి ఎం అభివృద్ధి చేస్తానో చెపుతానని అన్నారు. రామగుండం నియోజకవర్గ ప్రజలకు, కార్మికులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అత్యధిక మెజారిటీతో గెలవాలని శివాలయంలో పూజలు

**బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు నిఖిల్ గౌడ్...**



కామారెడ్డి / జుక్కల్ నియోజకవర్గం ప్రతినిధి, డిసెంబర్ 01 ( వాయిస్ టుడే ): కామారెడ్డి జిల్లా : ఎల్లారెడ్డి నియోజకవర్గం బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు నిఖిల్ గౌడ్ నిన్నటితో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి . మరి ఎల్లారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధన్ మోహన్ , తాను అధికారం లేకున్నా కూడా కొన్ని సంవత్సరాలనుండి నిరుద్యోగుల కు ట్రస్టు ద్వారా జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగాలు ఇప్పించి, యువత కు ఉద్యోగాలు కల్పించారు. పేదలకు ఉచిత కంటి వైద్య ఏర్పాటు చేసారు, కరోనా సమయంలో ఆక్సిజన్ లు, అంబులెన్సు లు, కరోనా మందును ఇలా ఎన్నో సేవలు అందించి, ఆపదలో ఉన్న ఇంటికి అండగా నిలిచారు. ఇలాంటి వ్యక్తి, నాయకుడు ఒక్కసారి గెలిచి అధికారం పొందితే , ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెంది, ప్రజల అవసరాలు కూడా తొందరగా తీరుతాయి, నిరుద్యోగులు, యువత ఉపాధి పొంది వాళ్ళ జీవితాలు కూడా మారుతాయి కాబట్టి ఇలాంటి నాయకుడు అత్యధిక మెజారిటీతో గెలవాలని పేట్ సంగెం శివాలయంలో పూజలు నిర్వహించి ఆ శివుడిని వేడుకుంటున్నారు. జిల్లా నాయకులు నిఖిల్ గౌడ్. ఈ కార్యక్రమంలో మండల నాయకులు భాను, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివ గౌడ్, నాయకులు నితిన్, శివ, సాయి కిరణ్, గణేష్, సంజీవ్, సురేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మలిదశ తొలి అమరుడు కానిస్టేబుల్ కృష్ణయ్య ముదిరాజ్

**తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల నీలకంఠం**




కామారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 01 (వాయిస్ టుడే) తెలంగాణ ఉద్యమ మలిదశలో ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడు కానిస్టేబుల్ కృష్ణయ్య ముదిరాజ్ అని తెలంగాణ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల నీలకంఠం అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో గల కానిస్టేబుల్ కృష్ణయ్య ముదిరాజ్ విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మలిదశ తెలంగాణ ఉద్యమంలో కానిస్టేబుల్ సర్వీస్ లో ఉండి కూడ ఉమ్మడి రాష్టంలో జరుగుతున్న అన్యాయానికి తీవ్ర మనస్తాపం చెంది తన రివాల్వర్ తో కాల్చుకొని ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడు కానిస్టేబుల్ కృష్ణయ్య ముదిరాజ్ అని ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మలిదశలో ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడిగా శ్రీకాంతాచారితో పాటు కానిస్టేబుల్ కృష్ణన్న కి గుర్తింపు ఇవ్వాలని ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో నీల నాగరాజ్ ముదిరాజ్, చింతల రమేష్, బిజెపి సీనియర్ నాయకులు మహేష్ ముదిరాజ్, పిల్లి మల్లేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆంజనేయులు, నర్సింలు, ప్రశాంత్, రాజు ,కృష్ణ, హరీష్, చింతల దశరథ్, కాక నరసింహులు, చిట్యాల ప్రమోద్, గరిగలింగం ఆకుల నాగార్జున, గోవర్ధన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.